12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 32 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 6 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :32 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 6 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ
- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు.

- మిగతా 2లో




# ఇంటింటికీ జలధార..

## రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు.

ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

- మిగతా 2లో

# 2029 నాటికి 4-స్టార్..

## ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని

- మిగతా 2లో



## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

- మిగతా 2లో

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

- టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ



- మిగతా 2లో

# నిజం బయటపడ్డది..




## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై రాహుల్ ఫైర్

పెన్ పవర్ డెస్క్: సర్ ప్రక్రియలో అవకతవకలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష తీరుపై ఆరోపణలకు సంబంధించి కేంద్ర

- మిగతా 2లో



# 'మా అనుమతి లేదు'..

## ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

పెన్ పవర్ డెస్క్:కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని

- మిగతా 2లో

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి



## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:పెరుగుతున్న అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యాచారం చేసే వారికి శిక్షలు మరింత కఠినంగా ఉండాలని .. రేప్ చేయాలంటేనే భయపడి పోవాలని ఢిల్లీ పోలీసులు కీలక ఆదేశాల జారీ చేసింది. ఢిల్లీ ఎన్ సీఆర్ అత్యాచారం కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

- మిగతా 2లో




## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

పెన్ పవర్ డెస్క్:భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగు తున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

## మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

- మిగతా 2లో



## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

## సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు.తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

## నిజం బయటపడ్డది..

- మొదటి పేజి తరువాయి

ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇవ్వడంపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన రాహుల్ గాంధీ.. ఫారమ్ 6లో మార్పులకు ఎటువంటి ఆమోదం తెలపలేదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్?పై ఫైర్ అయ్యారు.

'జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైంది. బీజేపీకి సహాయం చేయడానికి అతను తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు మాత్రమే. మన ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో పాలుపంచుకున్న జ్ఞానేష్?తో పాటు ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉంటారు" అని రాహుల్ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాత సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

### ఈసీ, కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు

సర్ ప్రక్రియలో అవకతకవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆయనను పదవి నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. అక్టోబర్ 5న ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో మిగిలిన ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

అంతేకాకుండా, ఫామ్ 6 మార్పులకు తాము ఎటువంటి ఆమోదం తెలపలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫామ్ 6?లో మార్పులు ఎవరు చేశారో రికార్డులను సమర్పించాలని ఆదేశించించింది. దేశంలోవ కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగించారన్న ఆరోపణల వేళ కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

నేరం పాల్పడే వారి మనసులో చట్టం పట్ల భయాన్ని కలిగించడం అవసరమని కోర్టు తెలిపింది. నేరం చేస్తే ఏం జరుగుతుందో , వాటి పరిణామాలకుభయపడకపోతే, అటువంటి నేరాలను నివారించడం కష్టమని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. సమాజంలోని ప్రతి మహిళ మన తల్లి, సోదరి వంటిది. మనం వారికి భద్రతా భావాన్ని కల్పించాలి. మనం ఇంట్లో మహిళల భద్రతను ఎలాగైతే నిర్ధారిస్తామో, సమాజంలో కూడా అలాగే చేయాలి. ఒక మహిళ బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తుంటే, పోలీసులకు ఆమె గురించి సమాచారం ఉండాలని, ఆమె భద్రతపై చురుకుగా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణ నవంబర్ 16కు వాయిదా వేసింది.

### నేరాలపై నిఘాకోసం వార్ రూం..

నేరాల నియంత్రణకు ఓ వార్ రూం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఢిల్లీపోలీసులను ఆదేశించింది. నేరాలను అరికట్టడంలో ఢిల్లీ పోలీసులు ఏవైనా ప్రత్యేక చర్యలు చేపట్టారా.. వార్ రూం లాంటిది ఏర్పాటు ఏదైనా ఏర్పాటు చేశారా అని పోలీసులను ప్రశ్నించింది. జాతీయ డేటా బేస్ ద్వారా అనుమానిత క్రిమినల్స్, ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని అధికారులను కోర్టు కోరింది. మహిళలు, విద్యార్థులనుపదే పదే వేధించే వ్యక్తులు ఉన్నారని, అన్ని ఏజెన్సీలు కలిసి నిఘా ఉంచితే పరిస్థితిని చక్కదిద్ద వచ్చని తెలిపింది. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులకు వార్నింగ్ ఇచ్చింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 2012 నిర్భయ కేసును కూడా ప్రస్తావించింది. అనుమతి లేకుండా నడుస్తున్న హోటళ్లలో మద్యం కూడా అందిస్తున్న ప్రదేశాలపై దృష్టి సారించాలని కోర్టు ఢిల్లీ పోలీసులను కోరింది. 2012 నాటి ఘటనకు సంబంధించిన రికార్డుల ప్రకారం, నిందితురాలు నేరం చేయడానికి ముందు ఓ ప్రదేశంలో భోజనం , మద్యం సేవించినట్లు కోర్టు పేర్కొంది.ఢిల్లీలోని భద్రతా ఏర్పాట్లపై కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, పార్కులలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సొలిసిటర్ జనరల్ ను కోరింది. క్షేత్రస్థాయిలో పోలీస్ నిఘా, జవాబుదారితనం, నియంత్రణ చర్యల అవసరాన్ని ధర్మాసనం నొక్కిచెప్పింది.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# ఇంటింటికీ జలధార..

- మొదటి పేజి తరువాయి

ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

### రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

### గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్‌ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 2029 నాటికి 4-స్టార్..

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

### నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు.ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

### అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు

ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

### రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

### స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది.మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు.ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.

ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరోత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు.ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- మొదటి పేజి తరువాయి

సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది.ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- మొదటి పేజి తరువాయి

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### కేసు నేపథ్యం ఇదే..

ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

## భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా బొత్స అనూష బాధ్యతల స్వీకరణ



పెన్ పవర్ న్యూస్ -- భీమిలి:భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్తగా బొత్స అనూష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స అనూష మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే ప్రధాన లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, పుష్ప శ్రీవాణి, బొత్స ఝాన్సీ, కేకే రాజు, గుడివాడ అమర్నాథ్, అనూషకు శుభాకాంక్షలు తెలిపారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## కొండవాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం లక్షలాది నిధులు మంజూరు...!





- ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం గుత్తేదారు అలసత్వంతో 10 గ్రామాల గిరిజనులు రాకపోకలు బంద్...!
- గిరిజనులు స్వతహాగా కర్రలతో వంతెన నిర్మించుకున్న వైనం...

**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 5 :** కొయ్యూరు మండలం యూ.చీడిపాలెం పంచాయతీ ఎర్రగొండ నీలవరం గ్రామాల మధ్యలో కొండవాగుపై వంతెన నిర్మాణానికి ఏడాది క్రితం ప్రభుత్వం 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసింది. చింతపల్లికి చెందిన కాంట్రాక్టర్ గత ఆరు నెలల క్రితం వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. వంతెన నిర్మాణ కాంక్రీట్ పనులకు వీలుగా వాగుకు రెండు వైపులా పెద్ద గుంతలు తవ్వి పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా తూరలు ఏర్పాటుచేసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు తూరలు కొట్టుకుపోయి దిగడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో త్వరితగతిన పనులు చేపట్టాలని గుత్తేదారు ఇంజనీరింగ్ అధికారులను అడిగినప్పటికీ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పంచాయతీ మాజీ సర్పంచ్ సహా పలువురు తెలిపారు. ఈ విషయమై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోయిందని పనులు అర్ధాంతరంగా నిలిపివేయడం పై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్న నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని స్థానిక ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలువ రెండువైపులా ఒడ్డు కోతకుగురవడంతో వాగును దాటే పరిస్థితి లేక పలు గ్రామాల ఆదివాసి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రగొండ, వేమనపాలెం, తీగలమెట్ట, గంగవరం, గొల్లబంద, నీలవరం, పాలసముద్రం, మర్రిపాకలు తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ఇటు పంచాయతీ కేంద్రానికిగాని మండల కేంద్రానికి రావాలన్న ఈ వాగును దాటాల్సిందే. దీంతో రాకపోకలు సాగించలేక ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగు ఉధృతి తగ్గకపోవడంతో రాకపోకలు సాగించేందుకు స్థానిక యువత చొరవ చూపి ప్రభుత్వం అధికారులు చేయలేని పనిని తాము చేపట్టి, కర్రలతో తాత్కాలిక వంతెన నిర్మించుకున్నారు. అయితే ఇది శాశ్వతం కాదు ప్రమాదకరమని తెలిసి అప్పటికి ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ బాధను గుర్తించి త్వరితగతిన వంతెన నిర్మాణం ప్రారంభించాలని పంచాయతీ మాజీ సర్పంచ్ దడాల రమేష్, వార్డు సభ్యుడు పి దామోదర్ తదితరులు కోరుతున్నారు.

## ఫార్మా, పరిశ్రమల్లో కార్మికులకు 20 శాతం బోనస్ ఇవ్వాలి.




**పరవాడ.: పెన్ పవర్: అక్టోబర్ 5:** ఫార్మా, పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు తక్షణమే ఈ నెల జీతాలతో కలిపి 20 శాతంబోనస్ ఇవ్వాలని సోమవారం పరవాడ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో లంకెలపాలెం లోనిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ బోనస్ చట్టం 1965 ప్రకారం లాభాల్లో ఉన్న ప్రతి పరిశ్రమ 8.33% నుండి 20% వరకు బోనస్ చెల్లించాలి. బోనస్ అనేది యాజమాన్యాల బిక్ష కాదు కార్మికుల హక్కు కార్మికులకు బకాయి పడ్డ వేతనం అని దీనిని అన్ని కేటగిరిలో పర్మినెంట్, కాంటాక్ట్, డైలీ వేస్ , హౌస్ కీపింగ్అన్ని కేటగిరీల కార్మికులకు వర్తిస్తుందని లాభనష్టాలతో సంబంధం లేకుండా ఈనెల వేతనంతో పాటు అన్ని పరిశ్రమలు యాజమాన్యాలు కార్మికులకు వెంటనే బోనస్ 20% చెల్లించాలని ఫార్మా యాజమాన్యాలపై కార్మికులందరూ బోనస్ ఇవ్వాలని యాజమాన్యాలపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కే రమణి, శంకరమ్మ, ఆర్ వెంకటలక్ష్మి, వరలక్ష్మితదితరులు పాల్గొన్నారు.

## 7 ఏళ్లుగా వేతన పెంపు లేకపోవడంపై విబిజి రామ్‌జీ సిబ్బంది వినతి.



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 05 పెన్ పవర్.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీబీజీ రామ్‌జీ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాలమేరకు గ్రామీణ అభివృద్ధి శాఖ--వీబీజీ రామ్‌జీ పథకంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ దీర్ఘకాలికసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నాడు గుమ్మలక్ష్మీపురంలోని కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి వినతిపత్రం సమర్పించారు.గత ఏడు సంవత్సరాలుగా వేతనాలు,జీతభత్యాల్లో ఎలాంటి పెంపుదల లేకపోవడంతో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.తమ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావాలని గతంలో ఆదేశాలు జారీ చేసినప్పటికీ,ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని తెలిపారు.ఉద్యోగ సంఘాలు సమర్పించిన న్యాయబద్ధమైన కోరికలు,దీర్ఘకాలిక సమస్యలను అక్టోబర్ 10 2026లోగా పరిష్కరించేలా ప్రభుత్వానికి మీ ద్వారా తెలియజేయాలని ఎమ్మెల్యేను కోరారు.తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,ఉద్యోగులకు న్యాయం జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే వినతిపత్రాన్ని స్వీకరించి,ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం న్యాయపోరాటం



- హైకోర్టు తీర్పును గౌరవిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 05 పెన్ పవర్.** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు34శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న విషయంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు.సోమవారం నాడు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ,బీసీలకు సామాజిక,రాజకీయ న్యాయం అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకుని జీవో నంబర్లు105,106 జారీ చేసిందన్నారు.అయితే ఈ నిర్ణయాన్ని వైసీపీ నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుకునే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు.స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగకూడదనే ఉద్దేశంతోనే పిటిషన్లు దాఖలు చేశారని ఎమ్మెల్యే విమర్శించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్ల సుమారు16,800 మంది బీసీ ప్రతినిధులు పదవులు కోల్పోయారని పేర్కొన్నారు.హైకోర్టు తీర్పును గౌరవిస్తూ,బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.న్యాయపరంగా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని బీసీలకు34శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.బీసీలకు34 శాతం రిజర్వేషన్లు కల్పించడం కేవలం రిజర్వేషన్ల అంశం కాదని,అది వారి రాజకీయ ప్రాతినిధ్యం,సామాజిక సాధికారతకు సంబంధించిన అంశమని ఎమ్మెల్యే అన్నారు.సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో తగిన భాగస్వామ్యం కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందన్నారు.బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే విషయంలో టీడీపీకి సుదీర్ఘ చరిత్ర ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.నాలుగు దశాబ్దాల క్రితమే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ 1987లో 20 శాతం,1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.బీసీల రాజకీయ సాధికారత అనేది టీడీపీ విధానంలో భాగమని అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలతో పాటు అన్ని వర్గాల హక్కులను కాపాడుతూ స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# అరకు లోయలో మెగా హాట్ ఎయిర్ బెలూన్ ప్రారంభం



### పర్యాటకులకు సరికొత్త ఆకాశ విహార అనుభూతి

**అరకులోయ పెన్ పవర్ అక్టోబర్ 5 :** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకు లోయలో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ఐటీడీఏ పద్మాపురం బొటానికల్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన "మెగా హాట్ ఎయిర్ బెలూన్ ను జిల్లా కలెక్టర్ నిషాంతి.టి, ఐఏఎస్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మతో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి, ఆకాశం నుంచి అరకు ప్రకృతి అందాలను వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అరకు లోయకు వచ్చే పర్యాటకులకు మరింత ఆహ్లాదకరమైన, సరికొత్త అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో హాట్ ఎయిర్ బెలూన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.అంతర్జాతీయ స్థాయి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఐటీడీఏ పాడేరు భాగస్వామ్యంతో బెలూన్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పర్యాటకులు, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పద్మాపురం గార్డెన్స్‌లో హాట్ ఎయిర్ బెలూన్ విహారాన్ని ఆస్వాదించాలని కోరారు.
కార్యక్రమానికి ముందు కలెక్టర్ పద్మాపురం గార్డెన్స్‌లో మొక్కను నాటారు.
ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ (పీవీటీజీ) ఎం. వెంకటేశ్వరరావు, పద్మాపురం గార్డెన్స్ మేనేజర్ బొంజు బాబు, తహసీల్దార్ శ్రీధర్ రాజు, ఎంపీడీవో వి. ప్రసాద్, కార్యక్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.హాట్ ఎయిర్ బెలూన్ సమాచారం కోసం:

99594 09715

95154 09715

స్థలం: పద్మాపురం బొటానికల్ గార్డెన్, అరకు వ్యాలీ.



# చింతకాయల విజయ్ చేతులమీదుగా జన్ని మత్స్య బాలరాజుకు ఘన సన్మానం

- మై టీడీపీ యాప్ ట్రైనింగ్ లో టాప్ అవార్డు, గ్రహిత జన్ని,మత్స్య బాలరాజు




**హుకుంపేట పెన్ పవర్ అక్టోబర్ 5:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మారుమూల కూతంగి గ్రామం నికి చెందిన జన్ని.మత్స్య బాలరాజు తండ్రి గాసన్న మై టిడిపి యాప్ యాక్టివేషన్ ట్రైనింగ్ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచారు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మరియు ఎంపి చింతకాయల విజయ్ సూచనల మేరకు రాష్ట్రస్థాయిలో శిక్షణకు జన్ని.బాలరాజు ను ఎంపిక చేశారు మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ యొక్క ట్రైనింగ్ లో భాగంగా బెస్ట్ ట్రైనర్,బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు ఇచ్చి ఎంపీ చింతకాయల విజయ్ చేతులు మీదగా సన్మానం చేసారు ఇటువంటి అవార్డులు రావడంతో టిడిపి నాయకులు గ్రామస్తులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు

## దసరా సంబరాలు ఘనంగా నిర్వహిద్దాం

మాజీ సర్పంచ్ సామెడ వెంకట పూర్ణిమ



**హుకుంపేట. పెన్ పవర్ అక్టోబర్ 5 :**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ హుకుంపేట గ్రామం శతకం పట్టు వీధిలో దసరా మహోత్సవాల సందర్భంగా దుర్గమ్మ తల్లి గుడి దగ్గర పండుగ పందిరి రాట వేసే కార్యక్రమం నిర్వహించారు . ప్రతి ఏడు లాగే ఈ సంవత్సరం కూడా దసరా మహోత్సవంలు ఘనంగా నిర్వహించనునట్టు శతకం పట్టు దుర్గమ్మ కమిటీ సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమం లో హుకుంపేట పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ సమిడ పూర్ణిమ,మాజీ ఎంపీటీసీ కొమ్మ రమ,టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సీనియర్ మహిళా నాయకులు సాగరి సత్యవతి,టీడీపీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సిరాగం సూర్య కాంతం, హుకుంపేట వైస్సార్సీపీ మండలం అధ్యక్షులు పాంగి అనిల్, మాజీ వార్డ్ మెంబెర్ కొర్ర నాగబాబు, వర్తక సంఘం యూత్ బొడ్డేటి శివ, నానాజీ, సంతోష్.మహిళలు, యూత్ కుర్రోళ్ళు శివ బాలు,రాము సునీల్, పార్థివ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా బొత్స అనూష బాధ్యతల స్వీకరణ

**పెన్ పవర్ న్యూస్ -- భీమిలి:**భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్తగా బొత్స అనూష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బొత్స అనూష మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే ప్రధాన లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, పుష్ప శ్రీవాణి, బొత్స ఝాన్సీ, కేకే రాజు, గుడివాడ అమర్నాథ్, అనూషకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రత్యేక చర్యలు...!

మండల అధికార్లు ప్రసాద్, జె ఈ ఈ రామక్రిష్ణ తహసిల్దార్ ప్రసాదరావు లు వెల్లడి.




**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 5 :** కొయ్యూరు మండలంలోని కొమ్మిక పంచాయితీ లో ఉన్న పలు గ్రామాల నుంచి వచ్చి ప్రజలు తెలిపిన దీర్ఘకాలిక, సాధారణ సమస్యల పరిష్కారానికి తమ పరిధిలో వాటిని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోనీ మిగిలిన వాటిపై పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి తెలియజేస్తామని మండల స్థాయి అధికారులు ఎంపీడీవో ప్రసాద్, జె ఈ ఈ రామకృష్ణ,తహసిల్దార్ ప్రసాదరావు లు తెలిపారు. కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయితీలో సోమవారం పీజీఆర్ ఎస్ సమావేశానికి హాజరైన వారిలో ఎక్కువ మంది తెలుపుతూ దేహాలపాలెం నుంచి కొంగసింగి వరకు కొమ్మిక నుంచి చోద్యం వరకు కనీసం నడిచివేల్లేందుకు వీల్లేని విధంగా రోడ్లు గోతులు దేరి ఉన్నాయని వాటినీ తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని కోరారు.ఈ రహదార్లుల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొన్నారు.ఈ పిజిఆర్ ఎస్ లో రెవెన్యూ 14, ట్రైబల్ వెల్ఫేర్ -4 ఆర్ డబ్ల్యూ ఎస్ -2 ఐసిడిఎస్ - 1 గృహ నిర్మాణం -1 టెలిఫోన్ టవర్స్ -1 ఎస్ ఎస్ ఎస్ ఏ -1 మొత్తం 24 వినతి పత్రాలను స్వీకరించినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాదరావు, మండల ఇంజినీరింగ్ అధికారి రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జుజిట్సు రాష్ట్రస్థాయి పోటీల్లో అక్కాతమ్ముడి సత్తా




- జాస్మిని కృష్ణప్రియకు రెండు బంగారు పతకాలు..
- లోహిత్ కృష్ణకు స్వర్ణం, రజతం

**చింతపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 5:**ప్రకాశం జిల్లా కనిగిరిలో అక్టోబర్ 4న నిర్వహించిన 7వ ఏపీ స్టేట్ జుజిట్సు ఛాంపియన్‌షిప్--2026-27 పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అక్కాతమ్ముడు ప్రతిభ చాటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో చింతపల్లి మండలం ఎర్నాపల్లి గ్రామానికి చెందిన పాడి జాస్మిని కృష్ణప్రియ, పాడి లోహిత్ కృష్ణ పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.చింతపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న జాస్మిని కృష్ణప్రియ అండర్--16, మైనస్ 50 కేజీల విభాగంలో ఫైటింగ్ విభాగంలో బంగారు పతకం, నివాజ్ విభాగంలోనూ బంగారు పతకం సాధించింది. అదే విధంగా ఆమె తమ్ముడు పాడి లోహిత్ కృష్ణ అండర్--12, మైనస్ 30 కేజీల విభాగంలో ఫైటింగ్‌లో రజత పతకం, నివాజ్ విభాగంలో బంగారు పతకం సాధించాడు.వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులతో హోరాహోరీగా తలపడిన ఈ అక్కాతమ్ముడు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వీరు కాకినాడకు చెందిన ఎస్ఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ శ్రీ సూర్య ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.ఈ సందర్భంగా జాస్మిని కృష్ణప్రియ, లోహిత్ కృష్ణ మాట్లాడుతూ.. జుజిట్సు విద్యను అభ్యసించేందుకు ప్రత్యేకంగా సెలవులు మంజూరు చేసిన చింతపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమకు మార్షల్ ఆర్ట్స్‌లో తొలి గురువుగా నర్సీపట్నంలోని ఆర్‌పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ ప్రసాద్ శిక్షణ అందించారని, ప్రస్తుతం కాకినాడ ఎస్ఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ సూర్య ఆధ్వర్యంలో కఠోర సాధన చేస్తున్నామని తెలిపారు.తమ విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, నిరంతర సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలకు వెళ్లిన ప్రతిసారీ తమ వెంట ఉండి ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్న తల్లిదండ్రులు పాడి కృష్ణ, రమలకు కృతజ్ఞతలు తెలిపారు.వరుస విజయాలతో ముందుకు సాగుతున్న ఈ అక్కాతమ్ముడిని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

## 25 మంది రైతులకు 'మీ భూమి--మీ హక్కు' పత్రాల పంపిణీ



సర్వేయర్ చంద్రకళకు రైతుల ఘన సన్మానం

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 5:**గూడెంకొత్తవీధి మండలం గాలికొండ గ్రామపంచాయతీ పరిధిలోని ఎం.బూసికొండ గ్రామంలో 25 మంది రైతులకు 'మీ భూమి--మీ హక్కు' పత్రాలను సోమవారం పంపిణీ చేశారు.రైతుల భూములకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేసిన గ్రామ సర్వేయర్ చంద్రకళను ఈ సందర్భంగా రైతులు ఘనంగా సన్మానించారు. భూ హక్కులకు సంబంధించిన పత్రాలు అందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ దుమంతి సత్యనారాయణ, వీఆర్వో ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బుజ్జిబాబు, పీసా సభ్యులు కొర్రా చందర్రావు, యిర్మీయా, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రావణా పల్లిలో 23 మందికి రాజముద్ర పట్టాలు పంపిణీ...!

టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ జిసిసి చైర్మన్ "ఎం. వి.వి ప్రసాద్"



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 5 :** మండలంలోనిరావణా పల్లిలో రాజముద్రతో కూడిన రీ సర్వే పట్టాలు 23 మందికి అందజేయడం జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ డిసిసి చైర్మన్ ఎం. వి. వి ప్రసాద్ తెలిపారు. సోమవారం రావణాపల్లి పంచాయితీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎం.వి.వి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఎటువంటి భూ వివాదాలకు తావు లేకుండా రైతులు భూములు సరిహద్దులు స్పష్టంగా ఉండేలా కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శంగా, పగడ్బందీగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసి రైతులకు రాజముద్రత కూడిన పట్టాలు అందజేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమం చేపట్టిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకొని ముందుకు వెళ్తుందని తెలియజేశారు. గతంలో రైతుకు రైతుల మధ్య అనేక భూ వివాదాలు ఉండేవని కానీ ఓటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ రీ సర్వే పట్టాలు రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు.

## రూ.24.90 లక్షలతో అంగన్వాడీ కమ్యూనిటీ భవనం ప్రారంభం





- లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ గణబాబు శ్రీకారం
- ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులకు ప్రాధాన్యం
- విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్,అక్టోబర్ 5 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 91వ వార్డు లక్ష్మీనగర్‌లో రూ.24.90 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ కమ్యూనిటీ భవనాన్ని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు, చిన్నారులకు, అంగన్వాడీ కేంద్రాల కార్యకలాపాలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా నిర్మించిన ఈ భవనం అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గణబాబు స్థానిక నాయకులు, అధికారులు, అంగన్వాడీ టీచర్లతో కలిసి రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కమ్యూనిటీ భవనానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. భవన నిర్మాణ పనులను పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ.. విశాఖ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటికి అనుగుణంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ వంటి సేవలు అందుతున్నందున వాటికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ భవనం ద్వారా స్థానికంగా నిర్వహించే అంగన్వాడీ, సామాజిక కార్యక్రమాలకు మరింత సౌకర్యం కలుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడేలా భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని గణబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమవతి, సీడీపీఓ నీలిమా, డీఈ వెంకటలక్ష్మి, కూటమి నాయకులు నారిపిన్ని సత్తిరాజు, బంగారు తులసీరామ్, నరవ అనూష, రొక్కం కొండలరావు, అలజంగి శ్రీను, సువ్వాడ మురళి, జీలని, రామకృష్ణ, సూరిబాబు, శివ, కనక ఏఈ శేఖర్, జీవీఎంసీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, కూటమి నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## "రాజుపేట" పాఠశాలలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

ఉపాధ్యాయులను సన్మానించిన పాఠశాల విద్యా కమిటీ సభ్యులు



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 5:** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండలంలో రాజుపేట పాఠశాలలో ఉపాధ్యాయులు అర్జున్, లక్ష్మణరావులను,పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కురుజు లక్ష్మిచిన్ని వైస్ చైర్మన్ సద్ద శోభన్ బాబు ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... తమ పాఠశాలలో విద్యాబుద్ధులు క్రమశిక్షణతో విద్యార్థులకు అందిస్తున్నారని కొనియాడారు. 1994 నుండి అక్టోబర్ ఐదు న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలియజేశారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులు భవిష్యత్తుకు మార్గదర్శకలే కాకుండా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే శిల్పులని అభివర్ణించారు మారుమూల ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి విశేషంగా అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయుడు సేవలో అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో జ్ఞానం క్రమశిక్షణ నైతిక విలువలను పెంపొందిస్తూ వారి జీవితాలను వెలుగు నింపే ఉపాధ్యాయుల సేవలును సమాజం ఎల్లప్పుడూ గౌరవించాలని వారి సేవలకు గుర్తింపు ఇలాంటి సన్మాన కార్యక్రమాలు మరింత నిర్వహించాల్సిన అవసరం ఎంతయిందో ఉందని వారు అన్నారు. గురువు నాటి జ్ఞాన బీజమె రేపటి సమాజానికి మహావృక్షంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు విద్యా కమిటీ సభ్యులు విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# స్థానిక ఎన్నికల్లో 'హ్యాట్రిక్' కొట్టాల్సిందే!



వైఎస్సార్‌సీపీ శ్రేణులకు గిరి ప్రసాద్ దిశానిర్దేశం

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 5:**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎవరికైతే అభ్యర్థిత్వం ఖరారు చేస్తుందో, వారి విజయానికి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ గూడెంకొత్తవీధి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ పిలుపునిచ్చారు. పాడేరు శాసనసభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు సోమవారం పెదవలస పంచాయతీ చాపరాతిపాలెం గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత కార్యక్రమం నిర్వహించారు.పెదవలస పంచాయతీ పార్టీ అధ్యక్షులు కంకిపాటి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, గూడెంకొత్తవీధి మాజీ ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన తర్వాత మూడోసారి జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. అన్ని స్థానాల్లో పార్టీ విజయానికి సమష్టిగా పనిచేసి 'హ్యాట్రిక్' సాధించాలని పిలుపునిచ్చారు.అనంతరం పెదవలస పంచాయతీ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరఫున ఐడెంటిటీ కార్డులను పంపిణీ చేశారు. ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో కార్యకర్తల సమన్వయంపై నాయకులు చర్చించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోయిన కుమారి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, జిల్లా క్రిస్టియన్ విభాగం అధ్యక్షులు వసుపరి తిమోతి, జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ, నియోజకవర్గ యువజన అధ్యక్షులు లమ్మసింగి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ, మండల సోషల్ మీడియా అధ్యక్షులు పాతూను లక్ష్మణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి అరికట్ల అంజి, మండల కార్యదర్శి సిరిబాల రామారావు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు కంకిపాటి శ్రీరాములు, సీనియర్ నాయకులు పిండి రామకృష్ణ, చాపరాతిపాలెం మాజీ వార్డు సభ్యులు గడుతూరి ఆనంద్, పంచాయతీ రైతు విభాగం అధ్యక్షులు కంకిపాటి బాలరాజు, పీసా అధ్యక్షులు గడితూరి జయరాం, యువత అధ్యక్షులు గడుతూరి రాజశేఖర్, జర్త నాగేశ్వరరావు, వాలంటీర్ విభాగం అధ్యక్షులు మర్రి చంటిబాబు, సీనియర్ నాయకులు గబుళంగి బొజ్జిబాబు, జర్త చిన్నబ్బాయి, జంబు బాలరాజు, కంకిపాటి శరబన్న పడాల్, గబుళంగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు భరోసా.. 43 మందికి ఉద్యోగాలు




* ప్రజా సంతృప్తే లక్ష్యంగా విధులు నిర్వహించాలి: మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 05** :విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యు త్ శాఖ ఉద్యోగుల కుటుంబాలను అన్ని విధా లా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికు మార్ అన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన 43 మంది బాధిత కుటుంబ సభ్యు లకు సోమవారం విశాఖపట్నంలో మంత్రి నియా మక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఇప్పటివరకు కారుణ్య నియామకాల కింద 450 మందికి పైగా ఉద్యో గాలు కల్పించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అంది స్తూ, ప్రజా సానుకూలత పెరిగేలా, వినియోగదా రులు సంతృప్తి చెందేలా విధులు నిర్వహించాల ని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడు విద్యుత్ శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రజలపై నయాపైసా అదనపు భారం మోపకుండా విద్యుత్ వ్యవస్థ ను గాడిలో పెడుతున్నామని మంత్రి తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు నెలలకోసారి విద్యుత్ చార్జీలు పెంచి విద్యుత్ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతికూల వాతావరణ పరిస్థి తులు ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది అహ ర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

**629 అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల భర్తీ**

శాఖ అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వర లో 629 అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల భర్తీ ప్రక్రి యను పూర్తి చేయనున్నట్లు మంత్రి వెల్లడిం చారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 7,000 మందికి పైగా సిబ్బందిని డిస్కంలలోకి అధికారికంగా తీసుకు న్నామని తెలిపారు.

**విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి కి ప్రాధాన్యం**

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి వినియోగదారుడికి నాణ్య మైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల ఆధునికీకరణ పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి చె ప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆర్‌డీఎస్ఎస్ పథకం, పీఎం సూర్య ఘర్ సోలార్ పథకం విస్తరణ, భూగర్భ కేబులింగ్, నూతన సబ్‌స్టేషన్ల నిర్మా ణం, విద్యుత్ లైన్ల అనుసంధానం వంటి పను లు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్ర దేశ్‌ను విద్యుత్ రంగంలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు చర్యలు కొనసాగు తాయని అన్నారు.

**ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి ఎంపీ భరత్**

ఎం.పీ భరత్ మాట్లాడుతూ,కారుణ్య నియా మకాలు పొందిన ఉద్యోగులు తమ వృత్తికి, కు టుంబానికి న్యాయం చేసేలా బాధ్యతగా పనిచే యాలని సూచించారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎనర్జీ కమిటీ సభ్యుడిగా ఉన్నానని, రానున్న రెండేళ్లలో విద్యుత్ నిర్వహణపై ప్రత్యేకంగా దృ ష్టి సారిస్తానని తెలిపారు.

**2024 నుంచి 157 మందికి కారుణ్య నియామకాలు**

ఈపీడీసీఎల్ సీఎండీ ఐ. పృథ్వీతేజ్ మాట్లాడు తూ,ఈపీడీసీఎల్ పరిధి 12 జిల్లాల్లో విస్తరించి ఉందని, సుమారు 30 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన, అనారోగ్యానికి గురైన ఉద్యోగుల కుటుంబాల్లో 2024లో 37 మందికి, 2025లో 77 మందికి, 2026లో 43 మందికి కారుణ్య నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖలో అత్యంత ప్రమాదకరమైన విధులు నిర్వహించే ఉద్యోగులు ఉన్నందున ప్రమాదాలు, మరణాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు శాఖ అండగా నిలుస్తుందని తెలిపారు.

**భూగర్భ కేబులింగ్ వేగవంతం చేయాలి ఎమ్మెల్యే పల్లా**

గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ మాట్లాడు తూ,బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. హుద్‌హుద్ తుపాను సమయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు అందించిన సేవలు ప్రశంసనీ యమని కొనియాడారు. ప్రస్తుతం చేపడుతున్న భూగర్భ కేబులింగ్ పనులను వేగవంతంగా పూ ర్తి చేయాలని సూచించారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన మంత్రి**

కార్యక్రమం అనంతరం మంత్రి గొట్టిపాటి రవికు మార్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశా రు,రోజుకు ఎన్ని ఫిర్యాదులు, కాల్స్ వస్తున్నా యి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నా రనే విషయాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ వినియోగదారుడితో ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ సేవలపై ఆయన అభిప్రాయా న్ని తెలుసుకున్నారు. వినియోగదారుల ఫిర్యా దులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారుల తో నేరుగా మాట్లాడటం ద్వారా ప్రజల్లో విద్యుత్ శాఖపై సానుకూల దృక్పథం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణ బాబు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## దుప్పులవాడలో వరి పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

* పురుగు, తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 5**:గూడెంకొత్తవీధి మండలంలోని దుప్పులవాడ గ్రామంలో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి సురేష్ పరిశీలించారు. ప్రస్తుతం పంట బూటింగ్ దశలో ఉన్నందున పంట పరిస్థితిని పరిశీలించి, పురుగు, తెగుళ్లు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు పలు సూచనలు చేశారు. వరి పొలాల్లో పాముపొడ తెగులు లక్షణాలు కనిపిస్తే హెక్సాకోనజోల్ ఎకరానికి 400 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మందు కాండం కింది భాగం, ఆకుమొన ప్రాంతాలకు బాగా తగిలేలా పిచికారీ చేయాలని తెలిపారు. దోమ ఉధృతి కనిపించినప్పుడు డైనోటెఫ్యూరాన్ 20 శాతం ఎకరానికి 80 గ్రాములు లేదా పైమెట్రోజైన్ 50 శాతం ఎకరానికి 120 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనల మేరకు సిఫార్సు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. అవసరం లేకుండా పురుగుమందులు పిచికారీ చేయకుండా సమగ్ర పురుగు, తెగులు యాజమాన్య పద్ధతులను పాటించాలని కోరారు.కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఆనందపురం పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు




**ఆనందపురం,పెన్ పవర్ అక్టోబర్ 5:**ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ఆనందపురం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆనందపురం వివేకానంద జూనియర్ కళాశాలలో నిర్వహించిన గట్కా అండర్–19 విభాగంలో ముగ్గురు, గిడిజాల సావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన గట్కా అండర్–17 విభాగంలో ఇద్దరు అర్హత సాధించారు. కొమ్మాది స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన జూడో పోటీల్లో ముగ్గురు, రగ్బీ అండర్–14 విభాగంలో ఒకరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, బుజ్జి, వెంకటరాజు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## గెలిచే అభ్యర్థులనే... మనం అందరం ఎన్నుకోవాలి...!



టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కాకూరు చంద్రరావు పిలుపు

**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 5 :** స్థానిక ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులనే మనమందరం ఎన్నుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కాకూరు చంద్రరావు పిలుపునిచ్చారు. మండలం తెలుగుదేశం పార్టీ,మండల అధ్యక్షులు కాకూరు చందరావు ఆధ్వర్యంలో డౌనూరు, గదబ పాలెం, చిట్టెంపాడు మూలపేట, పంచాయతీల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తో తెలుగుదేశం పార్టీ మండల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకూరు చంద్రరావు మాట్లాడుతూ... సమావేశ ముఖ్య ఉద్దేశం రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ కొరకై కలిసికట్టుగా పనిచేయాలని, అందరు సూచించిన అభ్యర్థికే ఎన్నుకోవాలని పార్టీ నేతలు సూచించడం జరిగింది. ఇందుకుగాను ఆశవహులులైనటువంటి వారు అభ్యర్థన చేయండి అని పార్టీతుది నిర్ణయమేపార్టీకి కట్టుబడి ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలానేతలు మాజీ జెడ్పిటిసి గాడి శ్రీరామూర్తి, దుచ్చారి చిట్టిబాబు, మాజీ ఎంపీపీ గొలిసింగి సత్యనారాయణ, కొర్రు రామూర్తి,అనిశెట్టి చిరంజీవి, శివరామరాజు,లోత భీమరాజు, శ్రీను బాబు చిన్ని, పొత్తూరు దేవుడు, సిగ్మెంట్ నాయకులు చలపతి, గోమాంగి రామకృష్ణ,దొండ ప్రసాద్, ఉల్లి వెంకటేశ్వర్లు, పుష్పలత, కిముడు శ్రీరాములు, వెంకట్వశ్వర్లు,దేవి, బన్నేని సన్యాసిరావు,స్వామినాయుడు, నేగుల లక్ష్మణరావు, పొట్టిక పోతురాజు, జన్ని రాజుబాబు, అక్షిసింగి దేవుడు,యాళ్ల నాగేష్ రాజు, రూత్తల జోగినాయుడు, తదితరులతో సమావేశం పాల్గొన్నారు. అనంతరం పార్టీ తుది నిర్ణయమే కట్టు బడి ఉండాలని నిర్ణయం తీసుకున్నారు.

## కంపరపాలెం, శ్రీలంక నుంచి జనసేనలోకి భారీగా యువత చేరికలు





* పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై 30 మందికి పైగా యువత చేరిక
* కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన బెహరా

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 5** : విశాఖ జీవీఎంసీ 92వ వార్డు కంపరపాలెం శ్రీలంక ప్రాంతంలో జనసేన పార్టీలోకి యువత భారీగా చేరారు. జనసేన పార్టీ చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో యువత పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ధవళ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువతకు ఆయన జనసేన పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేస్తున్న కృషిని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో జి. నర్సింగరావు, ఎస్. గణపతి, పి. కుమార్, పి. సైను, ఎం. పైడిరాజు, జి. గౌరీ నాయుడు, జి. అప్పలస్వామి, కే. సతీష్, పి. ధర్మతేజ, పి. దుర్గారావు, వి. రాజు, ఎన్. గణేష్, ఆర్. గణేష్, ఎన్. సంతోష్, ఎం. దుర్గాప్రసాద్, ఆర్. దుర్గాప్రసాద్, ఎస్. రవి, ఏ. తిరుపతిరావు, జె. సత్తిబాబు, ఏ. ఈశ్వరరావు, పి. విజయకుమార్, గోపాల్, జె. వైకుంఠరావు, జి. వినోద్ కుమార్, బి. హరి ప్రసాద్, వి. అప్పలనాయుడు, జి. సంతోష్, కే. హరీష్, సిహెచ్. రాజు, పి. ప్రసాద్, పి. సూర్యనారాయణ, ఎన్. భూషణ్, జి. తాతబాబు తదితరులు ఉన్నారు. 92వ వార్డులో జనసేన పార్టీకి యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని, రానున్న రోజుల్లో మరింత మంది యువత పార్టీతో కలిసి ప్రజా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కానున్నారని నాయకులు తెలిపారు. వార్డు పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపర కోటేశ్వరరావు, ధవళ మోహన్, కంపర రమణ, అట్టా శంకర్, నాగ వరప్రసాద్, ధవళ మారయ్య, గొంతిన శ్రీను, యు. రాజు, ఇల్లపు సురేష్, మనోహర్, ఆకుల నరసింగరావు తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడి ఉత్సవాల్లో పోషణపై అవగాహన

* గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై సూచనలు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, అక్టోబర్ 5**:అంగన్వాడి ఉత్సవాలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 8 వరకు, పోషణ మాసం సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 7 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణీలకు శ్రీమంతాల కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న మిషన్ వాత్సల్య, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ( పిఎంఎంవివై ) తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లను తల్లులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో బి హెచ్ వి రమణ బాబు, సీలేరు ఎస్ఐ యాసిన్ , ఐసిడిఎస్ సూపర్వైజర్ మోహిని అంగన్వాడి సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## 117వ వార్డు స్థాయి సమావేశంపై వైఎస్సార్‌సీపీ నాయకుల చర్చలు

త్వరలో విస్తృత వార్డు సమావేశం నిర్వహణకు సన్నాహాలు



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 5 :** పెందుర్తి నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 117వ వార్డుకు సంబంధించిన ముఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. త్వరలో నిర్వహించనున్న 117వ వార్డు స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. వార్డులో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వార్డు స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటు, స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని వాటిపై నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరంపై కూడా నాయకులు చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పీతల అప్పలరాజు, స్టేట్ యూత్ స్పోక్స్‌పర్సన్ చందు యాదవ్, నియోజకవర్గం వీవర్స్ వింగ్ నాయకులు కన్నూరు జగదీష్, పీతల విష్ణు, డి. నేను మూర్తి, కిల్లి అప్పారావు, వాడపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూ. చీడిపాలెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల కు "ఆల్బెండజోల్ "మాత్రల పంపిణీ-డాక్టర్ హేమంత్.



**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 5 :** మండలంలోని యూ. చీడిపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను పి హెచ్ సి వైద్యాధికారి హేమంత్ కుమార్ విద్యార్థులందరికి వేయించారు. ఇక్కడ పాఠశాలలో చదివే 150 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలతో జాతీయ నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిసార్డర్స్ ప్రోగ్రామ్ కింద పిల్లలందరికీ ఆయా టాబ్లెట్స్ ను డాక్టర్ హేమంత్ స్వయంగా వేయించారు. అనంతరం డాక్టర్ హేమంత్ చౌదరి మాట్లాడుతూ... పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఆరు నెలల కొసారి విధిగా ఆయా రెండు రకాల మాత్రలను తప్పనిసరిగా విద్యార్థులకు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుప్పులవాడ పీజీఆర్ఎస్‌కు 25 దరఖాస్తులు

సమస్యల పరిష్కారానికి చర్యలు: బిహెచ్వి ఎంపీడీవో రమణబాబు




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 5:**అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 25 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రమణబాబు తెలిపారు. మంచినీటి సదుపాయం, చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు, పంట పొలాలకు సాగునీరు, ఇళ్ల సమస్యలతో పాటు వివిధ అంశాలపై గ్రామస్థులు వినతులు సమర్పించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించి, జిల్లా స్థాయికి సంబంధించిన వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అవసరమైన పనులకు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను సమిష్టిగా గెలిపించాలి...!

- సిగ్మెట్ వారీగా అవగాహన సదస్సులు...
- మండల టిడిపి ప్రధాన కార్యదర్శి "తోటా దొరబాబు"



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 5:** రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి గెలిపించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, పేర్కొన్నారు. సోమవారం మండలంలో ప్రసిద్ధిగాంచిన ఎర్ర గుండమ్మ ఆలయ సన్నిధిలో శరభన్నపాలెం సెగ్మెంట్ కు టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దొరబాబు, సాంబశివరావు మాట్లాడుతూ...నియోజవర్గ స్థాయిలో కూటమి నాయకులు ఇప్పటికే ప్రత్యేక సమావేశం కొయ్యూరులో నిర్వహించారని అలాగే మండల స్థాయిలో కూటమి నాయకులకు కలసి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మండల స్థాయిలో పంచాయితీ, ఎంపీటీసీ సెగ్మెంట్ వారీగా పోటీ చేసే ఆశావహులు ఎవరైతే ఉన్నారో వాళ్ళందరూ అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఆ కమిటీలో కూటమి నాయకులు నిర్ణయం తీసుకొని పంచాయతీలు ఎంపీటీసీ అభ్యర్థులగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజేశ్వరి, కే వరలక్ష్మి, పనసల ఇందిరా వెలగల పాలెం టిడిపి పంచాయతీ ఇంచార్జ్ ఇరవాడ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దారకొండ నారాయణమూర్తి, జంపా వెంకటరమణ యూనిట్ ఇన్చార్జులు గాలి చెన్నారావు, లోత సింహాచలం బంటు లక్ష్మయ్య దేవత క్రాంతి నాలుగు పంచాయతీల నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 322 వినతులు




**విశాఖ, దక్షిణం పెన్ పవర్ అక్టోబర్ 05 :** కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజల నుంచి 322 వినతులు అందాయి. గృహ నిర్మాణం, భూ సంబంధిత సమస్యలు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, విద్య, వైద్య ఆరోగ్యం, సంక్షేమ పథకా ల ప్రయోజనాలు తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు సమర్పించారు.అందిన వినతుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 53, జీవీఎం సీకి సంబంధించినవి 91, పోలీస్ శాఖకు చెంది నవి 27 ఉండగా, ఇతర శాఖలకు సంబంధించి 151 ఫిర్యాదులు నమోదయ్యాయి.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన పీజీఆర్ఎస్ లో డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, డిప్యూటీ కలెక్టర్లు శేషశైలజ, గోవిందు, అదనపు కమిషన ర్ రమేశ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమ స్యలను నమోదు చేసుకున్నారు.

## గాంధీనగర్ లో నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా పందిరి రాట

**అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వెలగపూడి ప్రతాప్ రుద్ర**



**విశాఖ తూర్పు,పెన్ పవర్ అక్టోబర్ 5:**విశాఖ తూర్పు నియోజకవర్గం 14వ వార్డు గాంధీనగర్ లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.
స్థానిక శ్రీ దుర్గా లలితాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలకు సోమవారం పందిరి రాట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువనాయకులు వెలగపూడి ప్రతాప్ రుద్ర విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా నవరాత్రి పందిరికి రాట వేసి ఉత్సవాలను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ లో ప్రతి ఏటా భక్తి శ్రద్ధలతో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు కాకి గంగరాజు. వార్డు ఇంచార్జ్ అచ్యుత్ రావు, నాయకులు మూది అప్పారావు, రంగాల మంగరాజు,సింహాద్రి శేఖర్,సీత,గ్రామ పెద్దలు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిప్యూటీ తాసిల్దార్ కు అడ్డంగూడ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.

**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 05 పెన్ పవర్.** మండలంలో చెముడుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని తాటిశీల రెవెన్యూ పరిధిలో సుమారు20ఎకరాల మిగులు భూమిని నిరుపేద గిరిజనులకు పంపిణీ చేయాలని పీజీఆర్ఎస్ లో డిప్యూటీ తహసీల్దార్ నిమ్మక శేఖరానికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.అడ్డంగూడ గ్రామంలో అనేకమంది నిరుపేద గిరిజన కుటుంబాలు భూమి లేక జీవనోపాధికిఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వ్యవసాయ భూమి లేని అర్హులైన గిరిజన కుటుంబాలకు ఈ భూమిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తించి,సర్వే నిర్వహించి,అర్హత కలిగిన వారికి భూములు కేటాయిస్తే వారి జీవనోపాధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.కావున తాటిశీల రెవెన్యూ పరిధిలోని సుమారు20ఎకరాల మిగులు భూమిని పరిశీలించి,అర్హులైన అడ్డంగూడ గ్రామ నిరుపేద గిరిజన కుటుంబాలకు భూమి పంపిణీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.




## చింతపల్లిలో దారుణం...ఐదు నెలల పసికందు అనుమానాస్పద మృతి.

**గంజాయి మత్తులో కన్నతండ్రే బలితీసుకున్నాడని తల్లి కన్నీటి శోకం.**






**చింతపల్లి మన్యవాణి ప్రతినిధి, అక్టోబర్ 5.**అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఐదు నెలల పసికందు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వ్యసనాలకు బానిసైన కన్నతండ్రే తన బిడ్డను అత్యంత కిరాతకంగా చంపాడని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లి ఆరోపణలు ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లిలోని సాయినగర్ వీధికి చెందిన చందు, మణికుమారి దంపతులకు ఆరేళ్ల బాబు, మూడేళ్ల పాపతో పాటు ఐదు నెలల వయసున్న మరో మగ బిడ్డ ఉన్నాడు. భర్త చందు గత ఐదు నెలలుగా పనులకు వెళ్లకుండా, చెడు వ్యసనాలకు బానిసై ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారం భార్యపైనే పడటంతో, మణికుమారి స్థానికంగా ఉన్న ఓ హోటల్లో పనిచేస్తూ ఇల్లు గడుపుతోంది. ఈ క్రమంలో చందు తరచుగా డబ్బుల కోసం భార్యను వేధిస్తూ, ఇవ్వకపోతే తీవ్రంగా కొడుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే రోజులాగే ఉదయం నాలుగు గంటల సమయంలో నిద్రలేచిన చందు.. పనికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న భార్యను వంద రూపాయలు అడిగాడు. తన వద్ద ఇప్పుడు డబ్బులు లేవని, పనికి వెళ్లి వచ్చాక ఇస్తానని ఆమె చెప్పడంతో ఆగ్రహానికి గురైన అతను ఆమెపై దాడికి దిగాడు. భర్త దెబ్బలకు భయపడిన మణికుమారి పక్కనే ఉన్న వాళ్ల పిన్ని ఇంటికి వెళ్లి తలదాచుకుంది. అనంతరం ఉదయం ఆరు గంటలకు తిరిగి ఇంటికి చేరుకుని పిల్లల పనులు చూసుకుని, ఏడు గంటల సమయంలో చిన్న బాబుకు పాలు పట్టించి పనికి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఉదయం తొమ్మిది గంటల సమయంలో చందు ఆ పసికందును హోటల్ వద్దకు తీసుకువెళ్లగా, తల్లి పాలు పట్టించి తిరిగి ఇంటికి పంపించింది. అప్పటికి తన బిడ్డకు ఎలాంటి జ్వరమూ లేదని, ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడని తల్లి కన్నీటిపర్యంతమైంది. అయితే ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో బాబు తీవ్రంగా ఏడుస్తుండటంతో, ఏమి జరుగుతుందో అర్థంకాక ఇరుగుపొరుగు వారి సలహా మేరకు చందు స్థానిక చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ వైద్యులు సిపిఆర్ చేసి, అప్పటికే బాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మణికుమారి బంధువులతో కలిసి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుంది. విగతజీవిగా పడి ఉన్న బిడ్డను చూసి ఆమె గుండెలవిసేలా రోదించింది. మెడపై గాట్లు ఉన్నాయని, గంజాయికి బానిసైన తన భర్తే బాబును దారుణంగా చంపేశాడని ఆమె తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ హృదయ విదారక ఘటనపై తల్లి మణికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చింతపల్లి సీఐ సింహాచలం వెల్లడించారు. మృతిపై అనుమానాలు ఉన్నందున 'అనుమానాస్పద మృతి' కింద కేసు నమోదు చేశామని ఆయన స్పష్టం చేశారు. తదుపరి విచారణలో వెలువడే ఆధారాలు, పోస్టుమార్టం నివేదికల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

## దీక్షారంభ్--2026తో కొత్త విద్యార్థులకు స్వాగతం






**ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ రాజసింహారెడ్డి**

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, అక్టోబర్ 5:**పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ విద్యార్థుల కోసం మూడు రోజులపాటు నిర్వహించనున్న దీక్షారంభ్--2026 విద్యార్థుల పరిచయ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు ర్యాగింగ్ నివారణ, క్రమశిక్షణ, విద్యార్థుల ప్రవర్తనా నియమావళి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా డీఎస్పీ రాజసింహారెడ్డి, పాడేరు సీఐ ఎస్. రామారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కళాశాలలు, వసతి గృహాల్లో ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ర్యాగింగ్, మాదకద్రవ్యాల వినియోగం విద్యాభ్యాసంతో పాటు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు.సీఐ ఎస్. రామారావు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలను విద్యార్థులకు వివరించారు. చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడిక, స్పష్టమైన లక్ష్యం ఎంతో ముఖ్యమన్నారు. కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా వనరులు, మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల అంతర్గత నాణ్యత హామీ విభాగం సమన్వయకర్త, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన.



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 05 పెన్ పవర్.**మండలంలో,మండ కేంద్రపరిధిలో కుక్కిడి పంచాయతీ కుక్కిడి క్లస్టర్ లో బుషీన్ కోలాని గ్రామంలో ప్రకృతి వ్యవసాయ(ఎఫ్.ఎం.టి)ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ కమిడి భూషణ్,ఆధ్వర్యంలో ఇక్కడ మహిళా సంఘాలకు రైతులకు సామూహికంగా దేశవాళీ ఆవుపేడ మూత్రం ఇంగువ ద్రావణంపై చర్చించి మహిళా సంఘాల రైతులుతో తయారు చేయించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా భూషణరావు మాట్లాడుతూ,వరి పంటకు మరియు అని రకాల పంటలకు తెగుళ్లు అగ్గితెగుళ్లు పోడతెగుళ్లు,కాండం కుళ్ళు,పొట్ట కుళ్ళు,ఎండు తెగుళ్లు,రాకుండా ముందు జాగ్రత్తగా నివారణ చర్యగా పనిచేస్తుంది.దీనితోపాటు వ్యాధి నిరోధక శక్తిని మొక్కకు కావలసిన పోషకాలు కల్పిస్తుందన్నారు.అలాగే గ్రోత్ ప్రమోటర్గా పనిచేస్తుందని ఇందులో ఇంగువ సల్ఫర్,వాసన రావడం వల్లన పురుగులు ఆకుపైగుడ్లు పెట్టడానికి ఇష్ట పదవని ఈ విధంగా పురుగులను నివారణ చేస్తూ పంటని కాపాడుకోవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో ఐ.సిఆర్.పి సంధ్య మరియు ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన నేతకు పరామర్శ.



**చింతపల్లి మన్యవాణి ప్రతినిధి, అక్టోబర్ 5.**
రోడ్డు ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న జనసేన పార్టీ చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి చిన్ని రాజబాబును ఆ పార్టీ పెదబరడ పంచాయతీ అధ్యక్షులు కూడ రామకృష్ణ సోమవారం పరామర్శించారు. నర్సీపట్నంలోని రాజబాబు నివాసానికి స్వయంగా వెళ్లిన ఆయన.. ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి పార్టీ కార్యక్రమాల్లో మునుపటిలా చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. కాగా, ఈ నెల 3వ తేదీన పాడేరులో నిర్వహించిన ఎన్డీయే కూటమి సమన్వయ సమావేశానికి హాజరై తిరిగి వస్తున్న సమయంలో రాజబాబు ఊహించని విధంగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే జనసేన వీర మహిళ భావన సాయి తక్షణమే స్పందించి, గాయపడిన రాజబాబును హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తద్వారా ప్రాథమిక సమయంలోనే ఆయనకు మెరుగైన వైద్యం అందేలా చూశారు. మరోవైపు, ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య సైతం వెంటనే స్పందించారు. స్థానిక కౌన్సిలర్‌తో పాటు పలువురు జనసేన నాయకులను ఆసుపత్రికి పంపించి, రాజబాబుకు ఎలాంటి లోటు లేకుండా అవసరమైన సహాయ సహకారాలు అందేలా పర్యవేక్షించారు. ప్రస్తుతం మెరుగైన వైద్యం అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన రాజబాబు తన స్వగృహంలో కోలుకుంటున్నారు.

# బూత్ స్థాయి నుంచే కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి.

**స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి: బీజేపీ అల్లూరి జిల్లా ఇన్‌ఛార్జి పుట్టా గంగయ్య.**

**చింతపల్లి మన్యవాణి ప్రతినిధి, అక్టోబర్ 5.**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే ఏకైక లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి బీజేపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని అల్లూరి జిల్లా బీజేపీ ఇన్‌ఛార్జి పుట్టా గంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం తాజంగిలోని నీటి సంఘం అధ్యక్షుడు బాలయ్య పడాల్ ఫామ్‌హౌస్‌లో మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ అధ్యక్షతన 'చింతపల్లి మండల బీజేపీ పదాధికారుల సమావేశం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుట్టా గంగయ్యతో పాటు, మండల బీజేపీ ఇన్‌ఛార్జి, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుట్టా గంగయ్య మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలు, వృద్ధులకు వివరించి వారిలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేస్తూ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని కోరారు. సమావేశం సందర్భంగా నాయకుల సమక్షంలో వంతమామిడి గ్రామానికి చెందిన పలువురు స్థానికులు బీజేపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుడుముల వెంకట రమణ, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి లకే స్వాతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ ఈశ్వరరావు, మండల పదాధికారులు మాతే లక్ష్మణ్, వంతల మహేష్, పాడి కిషోర్ తదితర నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



# 72వ వార్డులో రూ.2.46 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**గాజువాక:పెన్ పవర్ ,అక్టోబర్ 05** జీవీఎంసీ 72వ వార్డులో చైతన్యనగర్ వద్ద రూ.2.46 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు.వార్డులో రహదారులు, కాలువల నిర్మాణం,ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఈ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,నాయకులు కరణం కనకారావు,సిరసపల్లి నూకరాజు,యజ్ఞప్రియ,వార్డు సెక్రటరీ సిహెచ్ కన్నారావు,యూనిట్ ఇంచార్జి విజయ్ సాయి,నారాయణ ప్రసాద్,టీవీ హనుమంతరావు,డివి సత్యారావు,మహాలక్ష్మి నాయుడు,స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,కార్యకర్తలు, అధికారులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల ఆనందపురం నూతన కమిటీ చైర్మన్ గా ముడసల శ్రీను (బాలు )

**ఆనందపురం, పెన్ పవర్,అక్టోబర్ 05,** ఆనందపురం పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ గా జనసేన పార్టీ నుంచి ముడసల శ్రీను ను కూటమి నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆనందపురం జనసేన పార్టీ ఆఫీస్ లో భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ డైరెక్టర్ సందీప్ పంచకర్ల ముడసల శ్రీను దంపతులకు సన్మానం చేశారు పంచకర్ల సందీప్ మాట్లాడుతూ ముడసల శ్రీను జనసేన పార్టీ ప్రారంభం నుంచి పార్టీకి కార్యకర్తగా తనవంతు పూర్తి సమయాన్ని పార్టీ కార్యక్రమంలో కేటాయించి పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషిచేసి సహకారాలు అందించారు కూటమి ప్రభుత్వం తను పార్టీ కి అందించిన సేవలను గుర్తించి స్కూల్ కమిటీ చైర్మన్ గా నామినేటెడ్ పదవి ఇవ్వడం జరిగింది ముడసల శ్రీను మాట్లాడుతూ పార్టీ తనమైన నమ్మకం ఉంచి స్కూల్ కమిటీ చైర్మన్ గా నియమించినందుకు భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు గారికి జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల సందీప్ గారికి కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను , ఆనందపురం జనసేన పార్టీ మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు , ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి ఉపాధ్యక్షులు గొలగాని గోవింద్ బాలు, తడివాడ శివకృష్ణ, వేములవలస పిఏసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ఆనందపురం గ్రామ జనసేనికులు ముడసల శ్రీను,కుప్ప అప్పారావు, మేడిశెట్టి గౌరీ శంకర్, వివిధ పంచాయతీల నుంచి వచ్చిన జనసేన నాయకులు పాల్గొన్నారు.




# తృప్తి కాంటీన్ ప్రారంభించిన ఎమ్యెల్ పల్లా

**కూర్మన్న పాలెం :పెన్ పవర్ . అక్టోబర్ 05** అగనంపూడి ఏరియా హాస్పిటల్ దగ్గర బస్ స్టాప్ పక్కన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు తృప్తి కాంటీన్ ఓపెన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు పేదలందరికీ తక్కువ ధరలో ఉండే రేట్లు కు టిఫిన్లు భోజనం అందించాలనే ఉద్దేశంతో, ఆర్థికంగా డ్వాక్రా సంఘాల ద్వారా వ్యాపారం చేసుకొనే వాళ్ళకి సహకార అందించాలని మెప్మా సంస్థ ద్వారా ఈ యొక్క తృప్తి క్యాంటీన్లు ప్రవేశపెట్టారని ఇది ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, అగనంపూడి జోనల్ కమిషనర్ మనీషా త్రిపాఠి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసు, 102 వ వార్డు అధ్యక్షులు కర్రి దశేంద్రరావు, మాజీ కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాదు, 102 జనసేన అధ్యక్షులు గవర సోమశేఖర్,103 వార్డ్ జనసేన అధ్యక్షులు మేడిశెట్టి విజయ్, బిజెపి అధ్యక్షుడు బలిరెడ్డి సత్యనారాయణ, విందుల రాజు, హాస్పిటల్ డైరెక్టర్స్ డొక్కా రమేష్, గజ్జల రవణమ్మ నూకరాజు, దాసరి రమేష్, కొర్రాయి జగదీష్, గొల్లవిల్లి కమాండో నూకరాజు, బండారు చందు రమేష్, పాముల వసంత్ , మాదాస్ రామకృష్ణ,నార పిన్ని అప్పలరాజు,ఈగల పోలినాయుడు, పలక అచ్యుత్, గొల్లవిల్లి పైడిరాజు, జంపా నాగేశ్వరరావు,తలారి శ్రీనివాసరావు,సర్వసుద్ది అప్పారావు, మేడిశెట్టి నరేష్, గాజువాక మహిళా ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, 103 మహిళా అధ్యక్షురాలు గళ్ళ అనిత, 102 ఐటిడిపి అధ్యక్షురాలు, గోపిశెట్టి పద్మ, జీవీఎంసీ అధికారులు, డ్వాక్రా సి ఓ లు, ఆర్పీలు మహిళా సంఘాలు, అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.




## డైస్ ఇనిషియేటివ్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఫీల్డ్ విజిట్, ఐడియా క్రియేషన్ కార్యక్రమం నిర్వహించిన వీఐఐటీ దువ్వాడ



**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,అక్టోబర్ 5** పాఠశాల విద్యార్థుల్లో ఇన్నోవేషన్, క్రియేటివిటీ, డిజైన్ థింకింగ్, ఎంటర్‌ప్రెన్యూరియల్ స్కిల్స్‌ను పెంపొందించే లక్ష్యంతో దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (అటానమస్) లో డైస్ (డెవలపింగ్ ఇన్నోవేషన్, క్రియేటివిటీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) ఇనిషియేటివ్‌లో భాగంగా “ఫీల్డ్ విజిట్ అండ్ ఐడియా క్రియేషన్” కార్యక్రమాన్ని నిర్వహించారు. విజ్ఞాన్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (వీసీఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం యువ విద్యార్థుల్లో ఇన్నోవేషన్, క్రియేటివిటీ, డిజైన్ థింకింగ్, ఎంటర్‌ప్రెన్యూరియల్ థింకింగ్‌ను పెంపొందించడంపై దృష్టి సారించింది.ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ నం. 2, నౌసెనాబాగ్, విశాఖపట్నంకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు విజ్ఞాన్ ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను సందర్శించి, ఇన్నోవేషన్ ప్రాక్టీసెస్, క్రియేటివ్ థింకింగ్, ఐడియా డెవలప్‌మెంట్‌పై హ్యాండ్స్–ఆన్ ఎక్స్‌పోజర్ పొందారు.కార్యక్రమంలోని సెషన్లను డా. కె. శ్రీనివాస నాయక్, ఎస్‌పీఓసీ, ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ మరియు ప్రొఫెసర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం, వీఐఐటీ మావూరి అరుణకుమారి, ఇన్‌చార్జ్, ఇన్నోవేషన్ సెల్ మరియు సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సీఎస్ఈ––సైబర్ సెక్యూరిటీ విభాగం, వీఐఐటీ ఏ నిర్వహించారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే పరిశీలనలు, రియల్–లైఫ్ ఛాలెంజ్‌లను ఇన్నోవేటివ్ సొల్యూషన్స్‌గా ఎలా మార్చుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. ఇంటరాక్టివ్ సెషన్లు, యాక్టివిటీస్ ద్వారా ఇన్నోవేషన్ జర్నీలోని కీలక దశలైన ప్రాబ్లమ్ ఐడెంటిఫికేషన్, ఆపర్చునిటీ రికగ్నిషన్, క్రియేటివ్ థింకింగ్, ఐడియా జనరేషన్, సొల్యూషన్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలకు ప్రాక్టికల్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయడం, ఎంటర్‌ప్రెన్యూరియల్ థింకింగ్‌ను పెంపొందించుకోవడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 12వ తరగతికి చెందిన మొత్తం 60 మంది విద్యార్థులు, 5 మంది ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు క్లాస్‌రూమ్ లెర్నింగ్‌కు భిన్నంగా ఇన్నోవేషన్ ప్రాసెస్‌ను ప్రాక్టికల్‌గా, ఆసక్తికరంగా అనుభవించే అవకాశం లభించింది.కార్యక్రమానికి పాఠశాల లీడర్‌షిప్, ఎస్‌పీఓసీలు, ఉపాధ్యాయులు చురుకైన సహకారం అందించారు. పాల్గొన్న ఉపాధ్యాయుల్లో శ్రీమతి జి. త్రివేణి, పీజీటీ––కెమిస్ట్రీ; శ్రీ ఎం. రాము, పీజీటీ––బయాలజీ; శ్రీ దేవేంద్ర దియోరి, టీజీటీ––పిఈహెచ్ఈ; జె. తేజశ్రీ, స్పోర్ట్స్ కోచ్ ఉన్నారు.మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ మరియు ఏఐసీటీఈ ఆధ్వర్యంలోని స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎస్ఐసీ) ఇనిషియేటివ్ పాఠశాల విద్యార్థుల్లో ఇన్నోవేషన్, క్రియేటివిటీ, డిజైన్ థింకింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ లక్ష్యాలకు అనుగుణంగా వీఐఐటీ చేపట్టిన డైస్ ఇనిషియేటివ్ ద్వారా విద్యార్థులకు ప్రాబ్లమ్ ఐడెంటిఫికేషన్, ఐడియా జనరేషన్ నుంచి ప్రోటోటైప్ డెవలప్‌మెంట్, స్టార్టప్ అవేర్‌నెస్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్), ఎగ్జిబిషన్స్, డెమో డేస్ వరకు క్రమబద్ధమైన మెంటరింగ్, ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్ అవకాశాలను అందించేందుకు కృషి చేస్తోంది. కార్యక్రమం డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్, వీఐఐటీ; డా. ఎ. సంపత్ దక్షిణామూర్తి, హెడ్, వీసీఐఎస్ మరియు సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ; డా. బి. ఓంకార్ లక్ష్మీ జగన్, ఇన్‌చార్జ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ మరియు అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఈఈ; డా. చ. భరత్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు ఇన్‌చార్జ్, ఐపీఆర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సీఎస్ఈ––సైబర్ సెక్యూరిటీ మార్గదర్శకత్వం, సహకారంతో నిర్వహించారు.

# బిజేపి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు సన్మానం

**గాజువాక:పెన్ పవర్ ,అక్టోబర్ 05** :గంగవరం మండలంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం –– సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా అంగన్వాడీ, ఆశా, వర్కర్స్, ఏ ఎన్ ఏం సిబ్బందికి సత్కారం.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవా ప్రస్థానానికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న “సేవా సంకల్ప్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా, గాజువాక నియోజకవర్గం, గంగవరం మండల అధ్యక్షులు పేర్ల అప్పారావు ఆధ్వర్యంలో మండల స్థాయి అంగన్వాడీ ఉత్సవం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో మండల పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏ ఎన్ఏం సిబ్బందిని సన్మానించి, వారి నిస్వార్థ సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్య ఆకర్షణగా 25 మంది గర్భిణీ మహిళలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి, వారికి కానుకలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజేపి గాజువాక ఇంచార్జ్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు హాజరై, ప్రసంగించారు.నరసింగరావు మాట్లాడుతూ, ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను స్ఫూర్తిగా తీసుకుని, సమాజంలోని బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ, ఆశా, ఏఎన్ఏం సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, పోషకాహారం, తల్లిబిడ్డల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలకు ఈ సత్కారం ఒక గుర్తింపు అని అన్నారు. గర్భిణీ మహిళలకు సీమంతం నిర్వహించడం ద్వారా మాతృత్వాన్ని గౌరవించడమే లక్ష్యమని, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్య అవగాహన, సానుభూతి పెంచుతాయని అన్నారు.




కార్యక్రమంలో నాయకులు గరికిన పైడిరాజు, మాధవి, చొడిపిల్లి రాజు, రోహిణి,వర్రి లలిత, జిలకర్ర భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు ముస్తాబవుతున్న మాలతమ్మతల్లి. ఆలయం



**కురుపాం అక్టోబర్ 05 పెన్ పవర్.** దసరా ఉత్సవాల సందర్భంగా కురుపాం మండలం నేరేడువలస గ్రామంలో వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవం మాలతమ్మతల్లి ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంటోంది.విజయదశమిని పురస్కరించుకుని నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ,దసరా ఉత్సవాలు సందర్భంగా మాలతమ్మ తల్లి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతో పాటు విద్యుత్ దీపాలు,పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించే పనులు చేపడుతున్నారు.ప్రతి ఏటా దసరా పర్వదినం సందర్భంగా మాలతమ్మతల్లిని దర్శించుకునేందుకు కురుపాం మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు నేరేడువలసకు తరలివస్తారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ఏర్పాట్లు,తాగునీరు,పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలపై నిర్వాహకులు దృష్టి సారిస్తున్నారు.నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపుతున్న రైతులు.




**గుమలక్ష్మీపురం అక్టోబర్ 05 పెన్ పవర్.** మండలంలో దుడ్డుఖల్లు యూనిట్ నెల్లికిక్కువ గ్రామంలో శ్రీ సాయి బయో రిసర్చ్ సెంటర్ లో గురువారం నాడు ఎఫ్,ఎం,టి పి.ప్రసాద్ ఆధ్వర్యంలో దశపరిని,నీమాస్త్రం,కషాయాలు మరియు ద్రావణాలు తయారు చేసి రైతులకు అందించారు.ఈ మేరకు ఎఫ్.ఎమ్.టి. ప్రసాదరావు మాట్లాడుతూ,రైతులు రసాయనిక ఎరువులను పూర్తిగా నిర్మూలించి సేంద్రియ ఎరువులపై మగ్గు చూపుతున్నారని, ఈ సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం వస్తుందని అంతేకాగా పంట దిగుబడి ఎక్కువ మోతాదులో వస్తుందని రైతులు తెలుపుతున్నారని ఆయన తెలిపారు.అందులో భాగంగా రైతులు చే కషాయాలు తయారు చేయించి వాటిని ఉపయోగించే విధానం పై వారికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,ఐ.సి.ఆర్.పి లు కొండ గౌర్రి మల్లికేశ్వరరావు,నిమ్మక చిరంజీవి,పెద్దయ్య,మల్లన్న,మరియు ప్రకృతి వ్యవసాయ రైతులు,పాల్గొన్నారు.

# పెదబయలులో గ్యాస్ ఆందోళన విరమణ





**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 05:** పెదబయలులో భారత్ గ్యాస్ సిలిండర్ గోడౌన్ తాత్కాలికంగా మూసేయడంతో ప్రజా సంఘాలు ఆందోళన చేస్తు ఆందోళన ఉదృతం చేసిన నేపధ్యంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలతో సోమవారం పెదబయలు భారత్ గ్యాస్ ఏజెన్సీ వారితో, జి సి సి అధికారులతో సుదీర్ఘంగా చర్చలు యధావిధిగా కొనసాగిస్తూనేపధ్యంలో జాయింట్ కలెక్టర్ హామీతో ఆందోళన కారులు వెనక్కి తగ్గిన్న ఆందోళన తాత్కాలికంగా విరమించారు.ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు మీడియాతో మాట్లాడుతూ...జాయింట్ కలెక్టర్ తిరుమణి పూజ శ్రీ ఆదేశాలతో వారం రోజుల లోపు అన్ని సర్దుమనీగే విధంగా చర్యలు తీసుకొంటామని భరోసా ఇవ్వడంతో తాత్కాలికంగా ఉద్యమానికి విరామం చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ త్వరితగతంగా సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాలకు పందిరి రాట.

- పూజా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ : ఉమ్మిడి.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** ఏలేశ్వరం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాలకు సోమవారం పందిరి రాట వేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తంగేటి రామలక్ష్మి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు దంపతులు పందిరి రాట కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ పూజ కార్యక్రమాలలో పండూరి రమణ పంతులు, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, గిరిజ దంపతులు, ఊర కృష్ణమూర్తి, ముత్యాల రమేష్, పగలపాటి కామేష్, నమశ్శివాయ, ఇంద్ర, రాజా , భక్తులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో పాటు నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరం

- అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 5:** స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "టెక్ ఉత్సవ్--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫ్రాక్టల్ ఎనలిటిక్స్ సంస్థకు చెందిన పిల్లి వైష్ణవి,గీతా కళ్యాణి పూతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, నేటి డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తులో టెక్నాలజీకి ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు.ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ, టెక్నాలజీ పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్, టీమ్‌వర్క్ వంటి నైపుణ్యాలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. డిగ్రీ విద్యతో పాటు ఈ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే మంచి కెరీర్ అవకాశాలను పొందవచ్చని పేర్కొన్నారు."డిగ్రీ విద్య కేవలం ఒక సర్టిఫికేట్ కాదు; అది మన భవిష్యత్తుకు బలమైన పునాది. విద్యార్థులు తమ మూడు లేదా నాలుగు సంవత్సరాల విద్యా కాలాన్ని కేవలం పరీక్షల కోసం కాకుండా,జ్ఞానం, నైపుణ్యాలు,వ్యక్తిత్వ వికాసం కోసం ఉపయోగించుకోవాలి" అని డా. నాయుడు సూచించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా. నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డా. నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వీఎస్ఎన్ కుమార్, ఏఐ డీన్ సిద్ధార్థ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మెర్లపాలెంలో జలజీవన్ మిషన్‌కు శ్రీకారం

- కొత్తపేట నియోజకవర్గంలో రూ.11.80 కోట్లతో తాగునీటి పనులు



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 5:** గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మెర్లపాలెంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్, అమరజీవి జలధార కార్యక్రమాల ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు.పల్లె పండుగ--3.0లో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలోని 16 ప్రాంతాల్లో తాగునీటి వసతుల కల్పనకు రూ.11.80 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులకు టెండర్లు పిలిచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ కింద అసంపూర్తిగా ఉన్న 31 మంచినీటి ట్యాంకుల నిర్మాణాలను రానున్న రెండు, మూడు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.తాగునీటి పథకాలతోపాటు గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, గోకులాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

# అహోబిల ఆసుపత్రిలో ప్రతి ఆదివారం స్థూలకాయ నివారణపై ప్రత్యేక కార్యక్రమం




**డా. ఆదిత్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

**కాకినాడ ,పెన్ పవర్,అక్టోబర్ 5:** స్థానిక అహోబిల ఆసుపత్రిలో డా.ఆదిత్య ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యులతో స్థూలకాయం నివారణ, నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థూలకాయ సమస్యతో బాధపడుతున్న వారికి వైద్యపరమైన సూచనలు,జీవనశైలి మార్పులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా.ఆదిత్య మాట్లాడుతూ.. స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి శాస్త్రీయంగా ఆమోదించబడిన చికిత్సా విధానాలు నిర్దిష్ట వైద్య సూత్రాలపై ఆధారపడి ఉంటాయని తెలిపారు.జీవనశైలి, ప్రవర్తనా మార్పులతో పాటు అవసరమైన వైద్య సహాయాన్ని అందించే సమగ్ర విధానం ద్వారా స్థూలకాయాన్ని నియంత్రించ వచ్చన్నారు. క్యాలరీల లోటు, సమతుల్య పోషకాహారం,తీసుకునే ఆహార పరిమాణాన్ని నియంత్రించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు.అలాగే అతిగా తినడానికి దారితీసే మానసిక,ప్రవర్తనా కారణాలను గుర్తించి వాటిపై దృష్టి సారించడం కూడా తమ వైద్య విధానంలో భాగమని తెలిపారు. స్థూలకాయ సమస్య పరిష్కారానికి అహోబిల ఆసుపత్రిలో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రత్యేకంగా సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజుకు 7--8 గంటల నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మానసిక ఒత్తిడి కారణంగా కార్టిసోల్ హార్మోన్ స్థాయిలు పెరిగి పొత్తికడుపు చుట్టూ కొవ్వు పేరుకుపోయే అవకాశం ఉందన్నారు.స్థూలకాయం అనేది శరీరంలో అధికంగా కొవ్వు పేరుకుపోవడం వల్ల ఏర్పడే తీవ్రమైన ఆరోగ్య సమస్య అని, ఇది కేవలం బాహ్య రూపానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని తెలిపారు.అనేక దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు స్థూలకాయం ఒక ముఖ్యమైన ప్రమాద కారకంగా మారుతుందని పేర్కొన్నారు.డా.అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ.. స్థూలకాయాన్ని తగ్గించుకోవడంలో ఆహార నియమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఆకుకూరలు,కూరగాయలు, తృణధాన్యాలు,మిల్లెట్స్, బ్రౌన్ రైస్ వంటి పీచు పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పప్పుధాన్యాలు,గుడ్లు,పన్నీర్ వంటి ప్రోటీన్ కలిగిన ఆహారాన్ని సమతుల్యంగా తీసుకోవాలని కోరారు.పంచదార,కూల్‌డ్రింక్స్,వేపుళ్లు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను వీలైనంత వరకు తగ్గించాలని,ప్రతిరోజూ యోగా లేదా వ్యాయామం చేయాలని సూచించారు. తగినంత నీరు తాగుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డా. శ్రీమన్నారాయణ,డా.రాజ్‌కుమార్,డా. మూర్తి,డా.చలం,డా.రావు నారాయణరావు,డా.సుష్మ,కాకినాడ సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గిరెడ్డి ఆరోపణలకు ఎమ్మెల్యే సత్యానందరావు కౌంటర్

**వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి.. నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరు**





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 5:** వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పల్లె పండుగ లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే బండారు ఆత్రేయపురంలో వైసీపీ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన హెల్త్ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పూర్తికాకముందే గత ప్రభుత్వం హడావుడిగా ప్రారంభోత్సవం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం ఫ్లోరింగ్ దెబ్బతిని భవనం నిరుపయోగంగా మారిందన్నారు.అమలాపురం రూరల్ ఇందుపల్లిలో రోడ్డు నిర్మాణంపై వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. బురద నేల, సాయిల్ కండిషన్ కారణంగా కొంత మేర రోడ్డు దిగబడిందని, వెంటనే కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయించామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్డు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1.20 కోట్లతో తొలి విడత పనులు చేపట్టామని పేర్కొన్నారు.ఆరోపణలు చేసే ముందు ఇందుపల్లి వెళ్లి ప్రజలను అడిగి వాస్తవాలు తెలుసుకోవాలని జగ్గిరెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. మైక్ దొరికిందని ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతారని అన్నారు.

# యర్రవరం అరటి మార్కెట్ యార్డులో ఘనంగా గణనాధుని అన్నప్రసాద వితరణ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 5:** మండల పరిధి యర్రవరం అరటి మార్కెట్ యార్డులో ఘనంగా గణనాధుని అన్నప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జాతీయ రహదారని అనుకోని ఉన్న అరటి మార్కెట్ యార్డ్ ఓనర్స్, వర్కర్స్ అద్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సుమారు 5000 మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ సభ్యులు మాట్లాడుతూ వినాయకుని చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, గణేష్ నిమజ్జనం అనంతరం ప్రతీ ఏటా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 5వేల మంది భక్తులు ఈ అన్న ప్రసాదాని స్వీకరించారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అన్నసంతర్పణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమం లో అరటి మార్కెట్ ఓనర్స్ అండ్ వర్కర్స్, నాయకులు, గ్రామ పెద్దలు , మహిళలు పాల్గొన్నారు.

# వాడపల్లి ఆలయంలో వరుణ జపాలకు శ్రీకారం



**సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం**

**రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల తో మంగళవారం నిర్వహణ**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 5:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం వరుణ జపాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఉపకార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర్‌రావు తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు కళకళలాడాలని, ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ విశిష్ట కార్యక్రమానికి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో వర్షాలు కురవడం అత్యంత కీలకమని, ప్రకృతి అనుకూల పరిస్థితులు నెలకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ప్రార్థిస్తూ వరుణ దేవుడిని ఆరాధించే సంప్రదాయంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేద మంత్రోచ్చారణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వరుణ జపాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సుభిక్షం కోసం ప్రార్థనలు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కాలువలు, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని, వ్యవసాయ రంగానికి అనుకూల పరిస్థితులు ఏర్పడాలని ఆకాంక్షిస్తూ వరుణ జపాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొననున్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com